## క్లుప్తంగా

### ఖరీఫ్‌కు అనుకూలంగా వర్షాలు

మాడుగుల రూరల్ : ఆరుద్ర కార్తె ప్రవేశంతో ఆదివారం అర్ధరాత్రి నుంచి ఆడపా, దడపా వర్షాలు కురుస్తున్నాయి. ఈ వర్షాలతో రైతులు ఖరీఫ్ వరి విత్తనాలు వేయడానికి సిద్ధమయ్యారు. సోమవారం గ్రామాల్లో గల రైతు సేవా కేంద్రాల్లో వరి విత్తనాల కోసం రైతులు తమ పట్టాదారు పాసు పుస్తకాలు, వన్‌బీ తీసుకువెళ్లి విత్తనాల కోసం నమోదు చేసుకుంటున్నారు. ఆర్‌జీఎల్ విత్తనాలు మాత్రమే ఉన్నాయని గ్రామ వీఏఏలు తెలిపారు. ప్రైవేటు వర్తకుల వద్ద వరి విత్తనాలు కొనుగోలు చేస్తున్నారు.

### పశువైద్యాధికారుల బదిలీ

మాడుగుల రూరల్ : కె.జె.పురం పశువైద్యాధికారిగా పనిచేస్తున్న కె.మణిలక్ష్మణ్ చీడికాడ మండలం పెదగోగాడ పశువైద్యాధికారిగా బదిలీపై వెళ్లారు. ఈయన స్థానంలో ఎవరూ బదిలీపై రాలేదు. అలాగే ఎం.కోడూరు, పశువైద్యాధికారి అరుణ్‌కిరణ్ విజయనగరం జిల్లా దెందేరు బదిలీపై వెళ్లారు. ఇంకా ఇక్కడకు ఎవరూ బదిలీపై రాలేదు. కె.వల్లాపురం పశువైద్యాధికారి నరేష్ వేములపూడి బదిలీపై వెళ్లారు. వీరి స్థానంలో దోసూరు పశువైద్యాధికారి శివ కుమార్ ఇక్కడకు బదిలీపై వచ్చారు. పెదగోగాడ పశువైద్యాధికారిగా పనిచేస్తున్న రాఘవమ్మ, చీడికాడకు బదిలీ కాగా, చీడికాడలో పనిచేస్తున్న గాయిత్రీదేవి దేవరాపల్లికి బదిలీ అయ్యారని మాడుగుల పశువైద్యశాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ వి. చిట్టినాయుడు తెలిపారు.

### జోగుంపేటలో వైద్య శిబిరం



వైద్య శిబిరం నిర్వహిస్తున్న వైద్యాధికారి

గొలుగొండ : వాతావరణం మార్పులు కారణంగా వచ్చే వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గొలుగొండ పీహెచ్‌సీ వైద్యాధికారి శ్యామ్‌కుమార్ అన్నారు. మండలంలో జోగుంపేట గ్రామంలో సోమవారం వైద్య శిబిరం ఏర్పాటు చేసి 53 మంది రోగులకు పరీక్షించి మందులు పంపిణీ చేశారు. అనంతరం వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### గురుకులంలో మిగులు సీట్లకు 25న ప్రవేశ పరీక్ష

నర్సీపట్నం : డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలలో 6,7,8,9 తరగతుల్లో మిగులు సీట్లకు ఈ నెల 25న తాళ్లపాలెం గురుకుల పాఠశాలలో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నామని నర్సీపట్నం గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎ.రాజేశ్వరి తెలిపారు. దరఖాస్తు చేసుకున్న బాలికలకు తాళ్లపాలెం గురుకులంలో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేశారన్నారు. 6,7 తరగతులకు ఉదయం 10 గంటల నుంచి 11 గంటలు, 8,9 తరగతులకు మధ్యాహ్నం 2 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు హాల్ టిక్కెట్, ఆధార్ కార్డులు పట్టుకొని హాజరు కావాలని సూచించారు.

### వరి విత్తనాలు సిద్ధం

మాకవరపాలెం : ఖరీఫ్‌లో రైతులకు పంపిణీ చేసేందుకు అవసరమైన వరి విత్తనాలు అన్ని రైతుసేవా కేంద్రాల్లో సిద్ధంగా ఉన్నాయని ఏవో డి.అప్పారావు తెలిపారు. ఆయన సోమవారం మాట్లాడుతూ మండలంలో ఈ ఖరీఫ్‌లో వరి సాగు చేసేందుకు 820 క్వింటాళ్ల విత్తనాలు అవసరమన్నారు. ఈ విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని, కావాల్సిన రైతులు ముందుగా రైతు సేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. ప్రస్తుతం రైతులకు పంపిణీ చేసేందుకు ఆర్‌జీఎల్ 2537, ఎంటీయు 1318, 1064, 1061, 1224 రకాల వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు.

### పిండ్రంగి మోడల్ స్కూల్లో 35 మంది విద్యార్థుల చేరిక



పాఠశాలలో చేరిన విద్యార్థులతో ఎంఈవోలు సత్యనారాయణ, ప్రసాద్

కె.కోటపాడు : ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులను చేర్పించాలని తల్లిదండ్రులకు మండల విద్యాశాఖాధికారులు కె.సత్యనారాయణ, డీవీడీ ప్రసాద్ తెలిపారు. పిండ్రంగి మోడల్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం 35 మంది విద్యార్థులు చేరారు. ఈ విద్యార్థులలో గ్రామం నుండి ప్రైవేట్ పాఠశాలలకు వెళ్తున్న 19 మంది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల్లో చదువులను మానేసి ప్రభుత్వ పాఠశాలలో చేరారు. అదేవిధంగా మిగిలిన విద్యార్థులు అంగన్‌వాడీ కేంద్రాల నుంచి పాఠశాలలో చేరారు. కార్యక్రమంలో సర్పంచ్ జాగరపు వెంకట రామలక్ష్మి, ఎంపీటీసీ నెక్కల గోపి, హెచ్‌ఎం శ్రీరామ్మూర్తి, పీఆర్‌టీయూ మండల శాఖ అధ్యక్షుడు పోతల నాయుడుబాబు, పి.రమేష్ పాల్గొన్నారు.

# నిరుపయోగంగా బాలికల వసతి గృహం

- డి.ఎర్రవరంలో రూ.2 కోట్లతో భవన నిర్మాణం
- ప్రారంభోత్సవానికి నోచుకోని వైనం
- విద్యా సంవత్సరం ప్రారంభమైనా పట్టించుకోని ప్రభుత్వం



నిరుపయోగంగా ఉన్న బాలికల వసతి గృహం భవనం




డి.యర్రవరం హైస్కూల్ ప్రాంగణం

నాతవరం : రూ.రెండు కోట్ల వ్యయంతో నిర్మించిన బాలికల వసతి గృహం భవనం ఇంకా ప్రారంభించకపోవడంతో నిరుపయోగంగా ఉంది. మండలంలో డి.యర్రవరం హైస్కూల్‌కు 2017–18లో అప్పటి ప్రభుత్వం రాష్ట్రీయ మాధ్యమిక సర్వశిక్షా అభియాన్ (ఆర్‌ఎంఎస్‌ఈ) ద్వారా రూ.కోటి 95 లక్షలు మంజూరు చేశారు. ఈ నిధులతో బాలికల వసతి గృహం భవనం నిర్మించేందుకు అదనపు స్థలం లేకపోవడంతో ఆటస్థలంలో భవనం నిర్మించారు. నిర్మాణ పనులు పూర్తి చేసి 2020లో కాంట్రాక్టరు సంబంధిత అధికారులకు నూతన భవనం అప్పగించారు. కానీ నేటికీ భవనం ప్రారంభించి వినియోగంలోకి తీసుకురాలేదు. హైస్కూల్‌కు ఎదురుగా అర్‌అండ్‌బీ రోడ్డును అనుకుని సర్వాంగ సుందరంగా నిర్మించిన భవనం ఏళ్ల తరబడి అలంకారప్రాయంగా దర్శనమిస్తుంది. భవనం వాడకుండా వదిలేస్తే వేగంగా శిథిలం అవుతుందని స్థానికులు అంటున్నారు. హైస్కూల్ ఆట స్థలంలో అడ్డుగా భవనం నిర్మించడం వల్ల విద్యార్థులకు ఆటలకు దూరంగా ఉన్నారు. కానీ భవనం ఉపయోగించకుండా వదిలేయడంతో రూ.రెండు కోట్లు ప్రభుత్వ నిధులు వృధా అయినట్టుగా భావిస్తున్నారు. వెంటనే నూతన భవనాన్ని ప్రారంభించి బాలికలకు వసతి సముదాయం కల్పించాలని పలువురు కోరుతున్నారు.

**మండలానికే ఆదర్శం..ఈ హైస్కూలు**

మండలంలో నాతవరం, మన్యపురట్ల, ఎం.బి.పట్నం, గునుపూడి చమ్మచింత తాండవ గ్రామాల్లో హైస్కూల్ రామన్నపాలెం, తాండవ ప్రాంతాల్లో గిరిజన ఆశ్రమ పాఠశాలలు ఉన్నాయి. వాటిలో డి.యర్రవరం హైస్కూల్లోనే అధిక సంఖ్యలో 550 మంది విద్యార్థులు చదువుతున్నారు. మిగతా హైస్కూల్లో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉంటుంది. ప్రతి ఏటా పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఈ హైస్కూల్ నుంచే మండల టాపర్‌లుగా నిలుస్తున్నారు.

**రూ.8 లక్షల బిల్లులు పెండింగ్**

కాంట్రాక్టరు సకాలంలో భవనం పనులు పూర్తి చేసి సంబంధిత శాఖ అధికారులకు అప్పగించారు. భవనం ప్రారంభించిన తరువాతే బిల్లులు చెల్లిస్తామంటూ ఆర్‌ఎంఎస్‌ఈ శాఖ అధికారులు అంటున్నారు. భవనం ప్రారంభం పేరుతో కూటమి ప్రభుత్వం ఏడాది కాలంగా రూ.లక్షలు మొత్తంలో బిల్లులు జాప్యం చేయడం దారుణమని కాంట్రాక్టరు వాపోతున్నాడు.

**నాడు–నేడులో హైస్కూల్ అభివృద్ధి**

గత ప్రభుత్వంలో నాడు–నేడు పథకంలో అదనపు భవనాలు, మౌలిక సదుపాయాలు కల్పించేందుకు రూ. 50 లక్షలు మంజూరు చేశారు. ఈ నిధులతో విద్యార్థులకు అవసరమైన అదనపు భవనాలు, మరుగుదొడ్లు తాగునీటి సమస్య వంటి పనులు పూర్తి చేశారు. హైస్కూల్లో విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశానికి గతంలో విచ్చేసిన స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు దృష్టికి ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు తీసుకెళ్లారు. అయినా ఇప్పటికీ ప్రారంభోత్సవానికి చర్యలు చేపట్టలేదు.

**త్వరలోనే ప్రారంభిస్తాం..**



నిరుపయోగంగా ఉన్న బాలికల వసతి గృహం భవనాన్ని ప్రారంభిస్తాం. పనులు పూర్తి చేశాం. దానికి సంబంధించిన మెటీరియల్ సిద్ధంగా ఉంది. హైస్కూల్‌లో ఆట స్థలం సమస్య ఉంది. ఈ ఏడాది హాస్టల్‌కు సిబ్బందిని నియమిస్తారని అంటున్నారు. ఈ సమస్య ఉన్నతాధికారుల దృష్టిలో ఉంది స్పీకరుతో ప్రారంభిస్తామంటున్నారు.

–ఆకుల కుమారి,
హెచ్‌ఎం డి.యర్రవరం హైస్కూల్

**వినియోగంలోకి తేవాలి..**



నిరుపయోగంగా కళ్ల ముందే ఏళ్ల తరబడి వృథాగా కన్పిస్తున్న నూతన భవనాన్ని కూటమి ప్రభుత్వం వెంటనే ప్రారంభించి వినియోగంలోకి తీసుకురావాలి. ఆట స్థలంలో భవనం నిర్మించి విద్యార్థులకు ఉపయోగపడకుండా వదిలేయడం సరికాదు.

–ఇనపసప్పల పుష్ప,
ఎంపీటీసీ సభ్యురాలు

### వి.సంతపాలెంలో ఉచిత ఆరోగ్య పరీక్షలు



వి.సంతపాలెంలో వైద్య పరీక్షల చేసి ఆరోగ్య జాగ్రత్తలను వివరిస్తున్న వైద్యాధికారి శైలజ

కె.కోటపాడు : వర్షాకాలం నేపథ్యంలో పరిసరాల పరిశుభ్రతపై ప్రజలు జాగ్రత్తలను పాటించాలని లంకవానిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి శైలజ తెలిపారు. వి.సంతపాలెం గ్రామంలో సంచార చికిత్స వైద్య సేవల్లో భాగంగా ఆమె సోమవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. 133 మందికి ఆరోగ్య పరీక్షలను జరపడంతో పాటు ఉచితంగా మందులను ఇచ్చారు. గర్భిణులకు ఆరోగ్య తనిఖీలు చేశారు. కిశోర బాలికలు రక్తహీనత బారిన పడకుండా ఉండేందుకు ఆకుకూరలు, పప్పు దినుసులతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని వైద్యాధికారి శైలజ సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ ప్రమీల, హెల్త్ అసిస్టెంట్ త్రినాథ్, ఎంఎల్‌హెచ్‌పీ మంగ, ఏఎన్‌ఎం పద్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

### సత్యవరం శివాలయంలో ప్రత్యేక పూజలు



స్వామివారికి అభిషేకాలు నిర్వహిస్తున్న దృశ్యం

మాడుగుల : మండలంలో సత్యవరం నూతన రామలింగేశ్వరాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. శివాలయంలో ప్రతి సోమవారం తెల్లవారు నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ప్రత్యేక పూజల్లో గ్రామం నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# పరిష్కార వేదికలో 21 అర్జీలు



తహసీల్దార్‌కు అర్జీ అందజేస్తున్న రైతులు

నర్సీపట్నం : ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 21 ఫిర్యాదులు వచ్చాయి. ఆర్డీవో రమణ కార్యాలయ పనిపై ఇతర ప్రాంతాలకు వెళ్లడంతో తహసీల్దార్ రామారావు కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. రీసర్వే చేసి భూ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మాకవరపాలెం మండలం, జంగాలపల్లికి చెందిన రైతులు అర్జీ పెట్టుకున్నారు. ఖాతా నంబరు 291లో అదనంగా నమోదైన భూమిని వెబ్ ల్యాండు నుంచి తొలగించాలని మాకవరపాలెం మండలం, గిడుతూరు గ్రామానికి చెందిన మూకల సీతారత్నం అర్జీ పెట్టుకున్నారు. రోడ్డు స్థలాన్ని ఆక్రమించి, రోడ్డు వేయకుండా ఇబ్బందులకు గురి చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గొలుగొండ మండలం, గుండుపాల గ్రామానికి చెందిన పలువురు ఫిర్యాదు చేశారు. మాకు భూమి లేదు రికార్డులో భూమి ఉందని చూపించడం వల్ల తల్లికి వందనం రాలేదని గొలుగొండ మండలం, చీడిగుమ్మల గ్రామానికి చెందిన గొర్లి దారబాబు అర్జీ పెట్టుకున్నారు. భూ సమస్యలు, తల్లికి వందనం, డ్రైనేజీ సమస్యలపై ఎక్కువగా ఫిర్యాదులు వచ్చాయి. ఈ సమస్యలను ఆర్డీవో దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానని తహసీల్దార్ అర్జీదారులకు హామీ ఇచ్చారు.

### డాక్టర్ సంతోష్ కుమార్‌కు ఘన సత్కారం

మాడుగుల : స్థానిక 30 పడకల ఆస్పత్రిలో రెండేళ్లుగా జనరల్ మెడిసిన్ వైద్యాధికారిగా పని చేసిన సంతోష్ కుమార్ చింతపల్లికి బదిలీ అవడంతో సోమవారం దుశ్శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎడ్ల కళావతి, ఆర్యవైశ్య సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనాదు శ్రీనువాసరావు, రంజిత్‌వర్మ, లెక్కల కాశిబాబు, పుప్పాల రమేష్, మరువాడ ఈశ్వరరావు, ఆసుపత్రి సూపరింటెండెంట్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

### మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల నిరసన




ఆందోళన చేస్తున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు

నర్సీపట్నం : సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఐదు రోజులుగా ఆర్డీవో కార్యాలయం ఎదుట సమ్మె చేస్తున్న తమను ఎవరూ పట్టించుకోవడం లేదని మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెలకు రూ.15 వేలు జీతం కాగా రూ.2 వేలు కటింగులు పోను రూ.13 వేలు చేతికి వస్తుదని, వచ్చిన వేతనం ఏమాత్రం సరిపోక కుటుంబ పోషణ భారంగా మారిందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇచ్చినప్పుడే తమ బతుకులు బాగు పడతాయంటున్నారు.

### ప్రభుత్వ పాఠశాలలో ప్రవేశాల కోసం గ్రామసభ

మాకవరపాలెం: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించాలంటూ గ్రామసభ నిర్వహించారు. మండలంలోని జి.వెంకటాపురం శివారు సుభద్రయ్యపాలెం ప్రాథమిక పాఠశాలలో ఒక్క విద్యార్థి కూడా లేదు. దీంతో సోమవారం ఎంఈవో పి.ఎస్.ఎన్.మూర్తి స్థానికులతో సమావేశమయ్యారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను తెలియజేశారు. ఈ నేపథ్యంలో ఏడుగురు విద్యార్థులను ఈ పాఠశాలలో చేర్పించేందుకు తల్లిదండ్రులు ముందుకు వచ్చినట్టు ఎంఈవో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు కృష్ణ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

### దేవరాపల్లిలో ఏకధాటిగా మోస్తరు వర్షం



దేవరాపల్లిలో వర్షం కురుస్తున్న దృశ్యం

దేవరాపల్లి : దేవరాపల్లి మండల వ్యాప్తంగా సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఓ మోస్తరు వర్షం కురిసింది. దీంతో రోడ్లన్నీ జలమయం అయ్యాయి. ఉదయం 8 గంటల ప్రాంతంలో ప్రారంభమై వర్షం సాయంత్రం వరకు ఏకధాటిగా కురవడంతో జనజీవనం స్తంభించిపోయింది. ప్రధాన రోడ్లన్నీ చిత్తడిచిత్తడిగా మారడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడ్డారు. లోతట్టు పంట పొలాల్లో సైతం వర్షపు నీరు చేరింది. కాగా ఉదయం కురుస్తున్న వర్షంతో వాతావరణం కూల్‌కూల్‌గా మారడంతో ఉక్కపోత నుంచి ప్రజలు ఉపశమనం పొందారు.

### రాయితీపై వరి విత్తనాలు పంపిణీ



వరి విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రాజు

రావికమతం : మండలంలోని టి.అర్జాపురం గ్రామంలో రైతు సేవా కేంద్రం వద్ద రైతులకు రాయితీపై వరి విత్తనాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని చోడవరం ఎమ్మెల్యే రాజు సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి రమేష్, గ్రామ సర్పంచ్ మడగల ఫాల్గుణ, మండల పార్టీ అధ్యక్షుడు రాజాన కొండనాయుడు, ఎంపీటీసీ మరిశా లక్ష్మి , రైతులు పాల్గొన్నారు.

### డిసెంబరులో పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

అనకాపల్లి: జీవీఎంసీ గవరపాలెం చిన్న హైస్కూల్‌లో 1953 నుంచి ఈ ఏడాది మార్చి వరకూ పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక డిసెంబర్‌లో నిర్వహించనున్నట్లు సంబంధిత సంక్షేమ సంఘం అధ్యక్షుడు బల్లా నాగభూషణం తెలిపారు. స్థానిక గవరపాలెం నూకాంబిక అమ్మవారి రహదారి పిరమిడ్ ధ్యాన మందిరంలో సోమవారం రాత్రి సంఘం ఆత్మీయ కలయిక జరిగింది. ఆయన మాట్లాడుతూ దేశంలో వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులకు సమాచారం అందిస్తామన్నారు. కుటుంబ సమేతంగా ఆత్మీయ కలయికను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బుద్ద వీరునాయుడు, కొత్తూర్తి రామారావు, భీశెట్టి శివరామకృష్ణ, కె.పాపయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

### ట్రిపుల్ ఐటీకి ఇద్దరు విద్యార్థినుల ఎంపిక

కశింకోట: స్థానిక బాలికల హైస్కూలు నుంచి ఇద్దరు విద్యార్థినులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. ఈ మేరకు సోమవారం ఎంపిక జాబితా విడుదల అయింది. ఈ ఏడాది టెన్త్ పరీక్షల్లో 600 లకు 579 మార్కులు పొందిన మలిరెడ్డి గౌరి, 578 మార్కులు పొందిన భర్నికాన దీపిక శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి ఎంపిక అయ్యారని హెచ్‌ఎం ఎంఎస్ స్వర్ణకుమారి తెలిపారు. వచ్చే నెల 2, 3 తేదీల్లో నూజివీడులో జరిగే ఇంటర్వ్యూలకు హాజరవుతారన్నారు.

# సుందరం...'సుమ'ధురం



కనువిందుచేస్తున్న గోవా ఫ్లవర్

చోడవరం : వర్షాలు కురుస్తుండడంతో రకరకాల పుష్పాలు కనువిందు చేస్తున్నాయి. చోడవరం పట్టణ శివార్లలో రక్షాబంధన్ రాఖీ మాదిరిగా రంగు రంగులను తలపించే పుష్పాలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. పాదు నుంచి పుట్టిన కాయ వికసించి రాఖీ పువ్వుగా కనువిందు చేస్తున్నాయి. చెట్టు ఆకులే పువ్వుగా కనిపించి అందరి దృష్టి ఆకర్షిస్తున్నాయి. క్రోటాన్ జాతికి చెందిన గోవా ఫ్లవర్స్ మనసులు కట్టి పడేస్తున్నాయి. వర్షాలు కురవడంతో సాధారణ రకాలతో పాటు సువాసన లేని ఇటువంటి పూలు ఈ తొలకరి సీజన్‌లో పూస్తాయని స్థానికులు చెబుతున్నారు.



పువ్వు కాదు ఇవి ఆకులే (అందమైన పువ్వుగా కనిపిస్తున్న ఆకులు)



కనువిందు చేస్తున్న రాఖీ పుష్పం

### శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ సేవలు శ్లాఘనీయం



శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

మాడుగుల రూరల్ : జనసంఘ్ వ్యవస్థాపక అధ్యక్షుడు, పార్టీ సిద్ధాంతకర్త, శ్యామ్‌ప్రసాద్‌ముఖర్జీ వర్ధంతి మాడుగుల బీజేపీ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. బలిదాన్ దివస్ కార్యక్రమంలో భాగంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో విశాఖ జిల్లా బీజేపీ ఇన్‌చార్జి పుట్టా గంగయ్య మాట్లాడుతు శ్యామ్‌ప్రసాద్‌ముఖర్జీ కాశ్మీర్ విముక్తి కోసం జరిగిన పోరాటంలో బలిదానం చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు అడ్వకేట్ శ్రీనాథు ప్రసాదరావు, ఎస్. వెంకటరాజు, కె. వెంకటేశ్వరావు, ఎస్. గంగాధర్ రావు, జి.వి.రమణ, బి. ప్రసాద్, నాయుడు, మోహన్‌రావు, పాండురంగ పాల్గొన్నారు.

### పీహెచ్‌సీ వైద్యాధికారుల బదిలీలు

మాడుగుల రూరల్ : మండలంలో కె.జె.పురం పీహెచ్‌సీ వైద్యాధికారిగా పనిచేస్తున్న కె.లీలా ప్రసాదు పద్మనాభం మండలం రేవిడి పీహెచ్‌సీకి బదిలీ అయ్యారు. సాధారణ బదిలీల్లో భాగంగా కె.జె.పురం పీహెచ్‌సీ వైద్యాధికారిగా ఏజెన్సీ ప్రాంతం అయిన సప్పర్ల పీహెచ్‌సీ వైద్యాధికారిగా పనిచేస్తున్న డాక్టర్ కె.సందీప్ బదిలీపై వస్తున్నట్టు స్థానిక పీహెచ్‌సీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఎల్.వి.ఎస్.ఎస్. ప్రసాదుపాత్రుడు సోమవారం తెలిపారు. వీరనారాయణం ఆరోగ్య ఉపకేంద్రంలో పని చేస్తున్న మహిళా ఆరోగ్య కార్యకర్త కొల్లి రమణమ్మ, చోడవరం మండలం పి.ఎస్.పేటకు బదిలీపై వెళ్లారు. చీడికాడ పీహెచ్‌సీ పరిధిలో ఖండివరంలో పనిచేస్తున్న గ్రేస్ కుమారి కె.జె.పురం ఆరోగ్య ఉప కేంద్రానికి బదిలీపై వచ్చారు. ఈ పీహెచ్‌సీలో పనిచేస్తున్న ఏఎన్‌ఎం శారద కింతలి పీహెచ్‌సీకి బదిలీపై వెళ్లారు. కె.జె.పురం పీహెచ్‌సీకి ఆప్తాల్మిక్ అసిస్టెంటుగా శ్రీనివాస్ బదిలీపై వచ్చారు. ఈయన విశాఖపట్నం ప్రాంతీయ నేత్ర వైద్యశాల నుంచి ఇక్కడ బదిలీపై వచ్చారు.

**కింతలి పీహెచ్‌సీ వైద్యాధికారికి బదిలీ**

కింతలి పీహెచ్‌సీ వైద్యాధికారిగా పనిచేస్తున్న కె.ఎం.నాయుడు చౌడువాడ పీహెచ్‌సీకి బదిలీపై వెళ్లారు. కింతలి పీహెచ్‌సీ వైద్యాధికారులుగా ఈదులపాలెం పీహెచ్‌సీ నుంచి ఆర్. శ్రీనివాస్, గెమ్మిలి పీహెచ్‌సీ నుంచి సోముదొర బదిలీపై రానున్నారు.

### విద్యార్థులకు వాసవీక్లబ్ వితరణ



గెడ్డబడిలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న వాసవీక్లబ్ అధ్యక్షుడు రమేష్ తదితరులు

మాడుగుల రూరల్ : మాడుగుల వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమంలో భాగంగా తాము దత్తత తీసుకున్న పాఠశాలల్లో (గెడ్డ బడి) పాఠశాల విద్యార్థులకు సోమవారం నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. వాసవీక్లబ్ అధ్యక్షుడు శ్రీనాథు రమేష్, వాసవీ జోన్ చైర్మన్ పుట్టా మాధవి, వనితా క్లబ్ అధ్యక్షురాలు పుట్టా రాధికతో పాటు స్థానిక వాసవీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

### వడ్డాది ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా చిన్నారావు



వడ్డాది కళాశాల ప్రిన్సిపాల్ చిన్నారావును అభినందిస్తున్న దృశ్యం

బుచ్చెయ్యపేట : వడ్డాది ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా జి.చిన్నారావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఇంత వరకు నర్సీపట్నం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉపన్యాసకునిగా పనిచేస్తూ వడ్డాది ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్‌గా పదోన్నతి పొందారు. కళాశాలల్లో సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. చిన్నారావును కళాశాల ఉపన్యాసకులు, ఇతర సిబ్బంది అభినందించారు. అలాగే అల్లూరి సీతారామరాజు జిల్లా డీఈవో భీమాశంకర్‌తో పాటు ఉత్తరాంధ్ర జిల్లాల కళాశాలల ప్రిన్సిపాళ్లు అభినందనలు తెలిపారు.

### యోగాంధ్ర విజేతకు అభినందనలు



రామలక్ష్మిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కోటవురట్ల: యోగాంధ్ర వ్యాసరచన పోటీలో జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి సాధించిన కొడవటిపూడి జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని కొంకిపూడి రామలక్ష్మిని ఉపాధ్యాయులు అభినందించారు. యోగాంధ్ర మండల, జిల్లా స్థాయి పోటీల్లో ఆమె ప్రథమ స్థానం పొంది రాష్ట్ర స్థాయి పోటీలో పాల్గొంది. సోమవారం స్థానిక పాఠశాలలో నిర్వహించారు. సర్పంచ్ కోసూరు అప్పారావు, ఎంపీటీసీ యలమంచిలి ప్రకాష్, స్కూల్ కమిటీ చైర్మన్ యలమంచిలి శ్రీను సత్కరించారు. హెచ్‌ఎం ఆర్.ప్రతాప్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో చురుగ్గా ఉండాలన్నారు. అన్ని రంగాలలో రాణించేలా కృషి చేయాలని సూచించారు. మోడల్ ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం వై.శ్రీనివాసరావు, ఉపాధ్యాయుడు లోవరాజు పాల్గొన్నారు.